క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు: వాజేడు ప్రభుత్వ ఐటీఐలో చేరడానికి విద్యార్థులు దరఖాస్తులను చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 2024–25 సంవత్సరానికి గాను ఐదవ విడత స్పాట్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 28 వరకు ఉదయం 11 గంటలలోగా దరఖాస్తులను చేసుకోవాలని కోరారు. రేపు(బుధవారం) నుంచి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాక్ ఇన్ అడ్మిషన్ ఉంటుందన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

మంగపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం 48వ వార్షికోత్సవ సభ కరపత్రాన్ని ఆ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు అధ్యక్షతన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 29న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్‌సైన్స్ కాలేజీలో జరిగే సభకు అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు, బహుజన సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు హరికృష్ణ, వెంకటేశ్వర్లు, యాదగిరి, సురేష్, నర్సింహారావు, నరేందర్, నాగేంద్రబాబు, ముకుందం, శోభన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నాయకులు అండగా ఉండాలి

మంగపేట: బిల్టు కార్మికులకు జరిగిన అన్యాయంపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమకు అండగా ఉండి స్పందించాలని బిల్ట్ పర్మినెంటు కార్మికులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిల్ట్ ఫ్యాక్టరీలో పనులు చేసుకుని అన్ని రకాలుగా లబ్ధి పొందిన రాజకీయ పార్టీల నాయకులు కార్మికులకు వేతనాలు ఇప్పించేందుకు ముందుకు రావాలని పేర్కొన్నారు. 2015 నుంచి తమ సమస్యలపై ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ఏ పార్టీ నాయకులు స్పందించలేదన్నారు. 2019లో రాజీనామా చేసిన జేఏసీ నాయకులు 2023లో సెటిల్‌మెంట్ పేపర్ల మీద ఏ విధంగా సంతకాలు చేశారో సమాధానం చెప్పాలన్నారు. కార్మికులకు రావలసిన వేతనాల డబ్బులు ఎంత దిగమింగారో చెప్పాలన్నారు. ఇప్పటికైనా కార్మికులకు రావలసిన వేతనాలు, గ్రాట్యూటీ ఇప్పించాలని లేని పక్షంలో 12 మంది జేఏసీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కార్మికులు పేర్కొన్నారు. ఈ విషయంపై తమకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు అండగా ఉండి న్యాయం జరిగేలా సహకరించాలని కోరారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



రవి(ఫైల్)

కన్నాయిగూడెం: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కంతనపల్లి చెరువు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం.. కంతనపల్లి చెరువు సమీపంలో వ్యక్తి మృత దేహం గుర్తు పట్టలేని స్థితిలో ఉండగా స్థానికులు సమాచారం మేరకు వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఏటూరు గ్రామానికి చెందిన చిట్యాల లక్ష్మయ్య తన అల్లుడు రవి కుమార్(25) శనివారం పనికి వెళ్లి ఇంటికి రాలేదని పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో వారిని సంఘటన స్థలం వద్దకు పిలిపించగా శరీరంపై ఉన్న పేర్లను చూసి రవి కుమార్ అనే గుర్తు పట్టినట్లు తెలిపారు. మృతుడు తాడ్వాయి మండలం కాటపురం గ్రామానికి చెందిన రవికుమార్ రెండు నెలల క్రితం అత్తగారింటికి వచ్చి కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతుడికి భార్య జ్యోతి, కూతురు ఖుషి ఉన్నారు. మృతి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ



మొగుళ్లపల్లి: మండలంలోని పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన జన్నె రాజు కూతురు జన్నె సాయిశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, నాయకులు కోడారి రమేశ్, వెంకట్‌రావు, శ్రీనివాస్, కమలాకర్ ఉన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

టేకుమట్ల/ రేగొండ: రాజీ మార్గమే రాజ మార్గమని టేకుమట్ల ఎస్సై గోగికారి ప్రసాద్, రేగొండ ఎస్సై సందీప్ కుమార్ మంగళవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని కోర్టులో నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీపడదగిన కేసులు, సివిల్, క్రిమినల్ కేసులు, బార్యభర్తల కేసులు, యాక్సిడెంట్ కేసులకు లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కేసులు రాజీ చేసుకోవాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వెంకటాపురం(కె): పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



వాజేడులో..

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని వైద్యాధికారి స్నేహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నగంగారం, చొక్కాల, తిప్పాపురం, పాత్రాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఆశీష్, వినయ్, సిబ్బంది మోహన్ ఉన్నారు.

గుమ్మడిదొడ్డిలో వైద్యశిబిరం

వాజేడు: మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ విజయ సమక్షంలో వైద్యాధికారి మహేందర్, వైద్య సిబ్బంది రోగులకు పలు రకాల పరీక్షలను నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త హీనతతో పాటు పలు పరీక్షలను చేసి పలు సూచనలను ఇచ్చారు.

ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత



బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ భద్రు

మంగపేట: ప్లాస్టిక్ నిర్మూలించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కొయ్యడ మల్లయ్య అన్నారు. మండలంలోని కమలాపురంలో జనవిజ్ఞాన వేదిక, జ్వాలా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ప్రపంచానికి పెనుసవాల్‌గా మారిందన్నారు. ప్లాస్టిక్‌పై నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకునీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ నియంత్రణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు ఎంపీడీఓ భద్రు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాకేష్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, లావణ్య, నర్సింహారావు, నాగలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ వేడుకల్లో డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

ఏటూరునాగారం: మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణంలోని చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు వెంకటయ్య, రాజేంద్ర ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రేణుక, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు మాలతిదేవి, రాజ్‌కుమార్, నరేష్, రామకృష్ణ, కార్తీక్, ఉపేందర్, జ్యోతి, ఫాతిమా, సంపత్, మున్ని, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఎల్‌టీఆర్ కేసును తేల్చని అధికారులు



మాట్లాడుతున్న బుచ్చయ్య

వాజేడు: మూడు సంవత్సరాల క్రితం ఏటూరునాగారం ఐటీడీఏలో ఎల్‌టీఆర్ కేసు పెట్టి వాయిదాలకు వెళ్లి ఆధారాలు చూపినా అధికారులు ఎటూ తేల్చడం లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు టింగ బుచ్చయ్య అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత మహిళ వెంకటనర్సమ్మతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ.. మండల పరిధిలోని అరుణాచలపురం గ్రామ సమీపంలో వెంకటనర్సమ్మకు సర్వే నెంబర్ 69/1లో మూడెకరాల భూమి ఉండగా ఆ భూమికి 1999 సంవత్సరం నుంచి ప్రభుత్వ పట్టా కలిగి ఉందన్నారు. కౌలు పేరుతో భూమిని సాగు చేస్తున్న గిరిజనేతరుడు వెంకటనర్సమ్మ భర్త 2022 సంవత్సరంలో మృతి చెందిన తరువాత ఆభూమిని ఖబ్జా చేసినట్లు ఆరోపించారు. అధికారులు వెంటనే వెంకటనర్సమ్మకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ శ్వేత

రేగొండ: మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన అల్లె స్వప్న ఇల్లు ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో బాధితురాలికి తహసీల్దార్ శ్వేత మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఆమె వెంట ఆర్ఐ జూపాక నరేష్, జూనియర్ అసిస్టెంట్ స్పందన ఉన్నారు.

ఆర్థిక సాయం

జయశంకర్ ఫౌండేషన్ రేగొండ మండల ఇన్‌చార్జ్ ఆకుల ప్రతాప్ అల్లె స్వప్న ఇల్లు కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేల ఆర్థిక సాయంతో పాటు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెన్నెపురెడ్డి అర్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో మంగళవారం గండ్ర సమ్మారావు(జీఎస్సార్)ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్య స్థితిగతులపై జాగ్రత్త వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది వరకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించుకున్నట్లు తెలిపారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

రేగొండ(కొత్తపల్లిగోరి): క్రీడల్లో గెలుపోటములను సహజమని చిట్యాల సీఐ మల్లేశ్ అన్నారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అండర్–14, అండర్–17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు భూపాలపల్లిలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ రఘుపతి తెలిపారు. తహసీల్దార్ వీరభద్రం, ఎస్సై సందీప్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్టీ బాలుర వసతి గృహం సందర్శన



భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం రాత్రి తహసీల్దార్ లక్ష్మీరాజయ్య సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీటీ మహేందర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

మొగుళ్లపల్లి: ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణాన్ని పరిరక్షించాలని మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులతో గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి పాఠశాల, ప్రధానోపాధ్యాయులు లింగాల కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో నదుల ప్రాముఖ్యం గురించి అవగాహన కల్పించారు. అనంతరం బతుకమ్మ వాగు దగ్గర, బతుకమ్మ ఆట ఆడుకునే చోట స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ గాజు పెంకులు చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జంపాల సుజాత, ఉపాధ్యాయులు నరసింహస్వామి, సంపత్ కుమార్, వీరయ్య, ఉమారాణి, రవీందర్, రాణి, ఎస్ రవీందర్, శోభా రాణి, శకుంతల, సందీప్, కవిత, రవి ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు

గణపురం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటల పరిరక్షణ చర్యలు తీసుకుంటూ రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి విజయ భాస్కర్ అన్నారు. పంటలను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్తి చేనులో నీరు ఉంటే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. నీరు నిల్వ ఉండకుండా కాల్వలు తీసి నీటిని బయటకు పంపాలన్నారు. పంట రక్షణ విషయంలో సలహాలు, సూచనల కోసం రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్, మండల వ్యవసాయాధికారి డి.అయిలయ్య, మండల విస్తరణ అధికారులు మౌనిక, కల్యాన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



రేగొండ: మండల కేంద్రంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల కూడలిలో ఎస్సై సందీప్‌కుమార్ మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ముందు జాగ్రత్తలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలను ముమ్మరం చేశారు. వాహనాల్లో ప్రయాణించే వారి వివరాలను సేకరించారు.

మహిళల అభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న రేగ కల్యాణి

ఏటూరునాగారం: రాష్ట్రంలో మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కల్యాణి పాల్గొని మాట్లాడారు. మహిళాలు అఖిల భారత మహిళా కాంగ్రెస్ చేపట్టిన సభ్యత్వంలో నమోదై పార్టీకి సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి మహిళలు అంకిత భావం, నిస్వార్థ సహకారం అందించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ని అందిస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, మహిళా సంఘాలకు కోట్ల రూపాయల నిధులు కేటాయించిందన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ సభ్యత్వ ప్రక్రియలో పాల్గొని కార్డులను పొంది కార్యక్రమాన్ని విజయవతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కట్కూరి రాధిక, మండల మహిళా కోర్డినేటర్ గీకురు భాగ్య, మాజీ ఉపసర్పంచ్ కర్ల అరుణ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా



పాత్రికేయులతో మాట్లాడుతున్న అధికారులు

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేటలో గల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ మండల పాత్రికేయులు మంగళవారం రామప్ప రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామప్ప జర్నలిస్టు సొసైటీ అధ్యక్షుడు బేతి సతీశ్ మాట్లాడుతూ.. పది నెలల క్రితం పాలంపేట శివారులోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ.. మంత్రి సీతక్కకు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశామన్నారు. గుడిసెలను తొలగించేందుకు రెవెన్యూ సిబ్బంది రావడంతో పాత్రికేయులందరూ రామప్ప రహదారిపై ధర్నా నిర్వహించడంతో తహసీల్దార్ సదానందం, ఎస్సై సతీశ్ సంఘటన స్థలానికి చేరుకొని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో పాత్రికేయులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో మండల పాత్రికేయులు దేశిని మహేందర్, గోరంటాల విజయ్, తీగల యుగేందర్, రంగిశెట్టి రాజేందర్, ఆలుగొండ రమేశ్, మునిగాల రాజు, దండెపల్లి సారంగం, కేతిరి భిక్షపతి, బానోతు యోగి, దేశిని వీనీల్, ఆకుల రామకృష్ణ, శివ, ప్రశాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మనుగడ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మొక్కలతో మానవుని జీవనాధారం ముడిపడి ఉందని, మానువుల మనుగడకు మొక్కలు పెంచాలని మనం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు చౌలం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మనం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలోని విద్యార్థినులు, ఇందిరానగర్ పాఠశాల విద్యార్థులతో పారిశుద్ధ్యం, స్వచ్ఛదనంపై అవగాహన ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. రోడ్ల వెంట చెత్తాచెదారాన్ని గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం, స్వచ్ఛదనంతో ఆరోగ్యానికి మేలన్నారు. ప్రతి ఒక్కరూ భవితరాల భవిష్యత్ కోసం మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో పీజీ హెచ్‌ఎం రేగ కేశవరావు, కేజీబీవీ స్పెషలాఫీసర్ పుష్పనీల, పంచాయతీ కార్యదర్శి రేగ రాజశేఖర్, సీఆర్పీ వసంతరావు, జీపీ కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయాలి



ములుగు రూరల్: మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్



వెంకటాపురం(కె): సమావేశంలో నాయకులు

ములుగు రూరల్: గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించాలని ఈ నెల 28న ఐటీడీఏ ఏటూరునాగారంలో చేపట్టనున్న గిరిజన ఉపాధ్యాయుల ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకుడు పోరిక శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని రాయినిగూడెం ఆశ్రమ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో 30:70 నిష్పత్తిలో పదోన్నతులు కల్పించాలన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో బ్లాక్ చేసిన పోస్టుల వల్ల జరిగిన నష్టాన్ని సీనియర్ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని అన్నారు. గిరిజన ఉపాధ్యాయులు ధర్నాలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా రాజు, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహిపతి, సంతోష్‌కుమార్, రఘుశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): ఏటూరునాగారం ఐటీడీఏ ఎదుట గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించే ధర్నాను విజయవతం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సబక నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలో ఉపాధ్యాయ సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృష్ణప్రసాద్, సమ్మారావు, రాజు, రమేశ్, శ్రీను తదితరులు ఉన్నారు.

మిర్చి పంటపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

చిట్యాల: ఎన్ఎస్ఎస్‌పీ ద్వారా మిర్చి పంటపై రైతులకు మాస్టర్ ట్రైనర్ కె.ఉపేందర్‌రెడ్డి మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐపీఎం, ఐఎన్ఎమ్ పద్ధతులతో సాగు చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. సేంద్రీయ సాగు విధానం, పంట కోతల విధానం, అలాగే మార్కెంటింగ్ పద్ధతులపై శిక్షణ ఇచ్చి దానికి తోడుగా జీవ వైవిద్య రక్షణ, వాతావరణ సంరక్షణ, సామాజిక బాధ్యతలు గుర్తు చేస్తు పెట్టుబడి తగ్గడానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి–సత్యం, పోతన ఎన్జీఓ చీఫ్ ఫంక్షనరీ జి.వెంకట్‌రెడ్డి, ఓరుగల్లు ఎఫ్పిఓ ఎండి, సత్యనారాయణ రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ సునీల్, ఏఈఓలు సన్నీ, రమణకుమార్, సందీప్, రైతులు చాడ సమ్మిరెడ్డి, కనుకుల రాంరెడ్డి, కంచర్ల కిష్టయ్య, పింగిలి జ్యోతి, పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.